## కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే గువ్వలను కలిసిన పార్టీ శ్రేణులు



మాజీ ఎమ్మెల్యే గువ్వల ను కలిసి బీఆర్ఎస్ నాయకులు

చారకొండ, డిసెంబర్ 12 : బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దన్నారు. మంగళవారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును చారకొండ మాజీ ఎంపీటీసీ చిన్న ఈదమయ్య, పార్టీ శ్రేణులు హైదరాబాద్‌లోని తన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి ఆందోళన గురికావొద్దని, ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు తానేశ్, శివ, రవీందర్, సురేశ్, యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

## శివస్వాములకు అన్నదానం



శివస్వాములకు భోజనం వడ్డిస్తున్న సీఐ జలంధర్‌రెడ్డి

కల్వకుర్తి, డిసెంబర్ 12 : పట్టణంలోని సుభాష్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయ మండపంలో గురుస్వామి ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో శివస్వాములకు మంగళవారం అన్నదానం కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా సీఐ జలంధర్‌రెడ్డి శివస్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి చేయూత అందించారు. ఈ సందర్భంగా సీఐని శివస్వాముల తరఫున ఆనంద్‌గౌడ్ సన్మానించారు.

## వైభవంగా కార్తీకమాస పూజలు

బిజినేపల్లి, డిసెంబర్ 12 : మండలంలోని ఆయా గ్రామాల ఆలయాల్లో మంగళవారం కూడా కార్తీకమాస పూజలు వైభవంగా నిర్వహించారు. పాలెం, బిజినేపల్లి గ్రామాల్లో శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శైవ ఆలయాల్లో శివలింగానికి పంచామృత అభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు.అదేవిధంగా సాయంత్రం ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్దఎత్తున దీపాలను వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు నానయ్య, చక్రపాణి, జయంత్, శుక్లాచార్య, శివ గణేశ్ ఉన్నారు.

## ఎక్సైజ్ దాడుల్లో నల్లబెల్లం పట్టివేత

అచ్చంపేట రూరల్, డిసెంబర్ 12 : మండలంలోని చౌటపల్లి తండా సమీపంలో మంగళవారం రూట్‌వాచ్‌లో నిషేధిత నల్లబెల్లం 600 కిలోలు, 100 కిలోల స్పటికను తరలిస్తున్న హనుమంతును పట్టుబడ్డాడు. వెంటనే అరెస్టు చేసి కేసు నమోదు చేశారని ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య తెలిపారు. దాడుల్లో ఎస్సై బాలరాజు, సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రుణాలు సకాలంలో చెల్లించాలి

వీపనగండ్ల, డిసెంబర్ 12 : గతంలో తీసుకున్న బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించాలని ఐవోబీ మేనేజర్ రవీందర్ బాబు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో విలేకర్లతో ఆయన మాట్లాడారు. బ్యాంకులో రుణాలు పొందిన వారు సంవత్సరంలోపే రెన్యూవల్ చేసుకోవడంతో తక్కువ వడ్డీతో పాటు వ్యక్తిగత సివిల్ పెరుగుతుందన్నారు. వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా క్లియర్ చేసుకోవాలని సూచించారు.

## ‘పది’ విద్యార్థుల వివరాలు సేకరణ

పాన్‌గల్, డిసెంబర్ 12 : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో పాన్‌గల్, వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పదోతరగతి విద్యార్థుల నామినల్ రోల్ వెరిఫికేషన్ వివరాలను మంగళవారం ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, వెంకటేశ్, మోహన్ పాల్గొన్నారు.

# హక్కులను సక్రమంగా ఉపయోగించుకోవాలి

- న్యాయవిజ్ఞాన సదస్సులో జూనియర్ సివిల్ జడ్జి మిథున్‌తేజ




సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి మిథున్‌తేజ

కొల్లాపూర్, డిసెంబర్ 12 : రాజ్యాంగ పరంగా సంక్రమించిన హక్కులను సక్రమంగా ఉపయోగించుకోవాలని స్థానిక సివిల్ జడ్జి ఆర్వీఎస్ఎస్ మిథున్‌తేజ, ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్నగుంటి సూచించారు. మానవహక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో వారు మాట్లాడారు. స్వతంత్రంగా ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా సమాజంలో మసలుకోవాలని,విద్యా హక్కు,ఆర్థిక హక్కులను నిత్యాజీవితంలో ఎదురయ్యే సమస్యలను సానుకూలంగా రాజీమార్గం ద్వారా ఇరుపక్షాలు చర్చించుకొని తగాదాలను పరిష్కరించుకోవాలని వారు సూచించారు. జడ్జి జ్యోత్స్నగుంటి మాట్లాడుతూ ప్రాథమిక హక్కులైన విద్యాహక్కు ద్వారా మీ పిల్లలను మంచి చదువులు చదివించుతూ వారు సన్మార్గంలో పయనించే విధంగా చూడాలన్నారు. ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఇరుపక్షాలు రాజీమార్గం ద్వారా సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో మూడు కోర్టులకు హాజరైన కక్షిదారులు, బార్‌అసోసియేషన్ న్యాయవాదులు. వసంతరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగరాజు,నిరంజన్, శ్రీనివాస్‌రావు,ఉపేందర్, మధుసూదన్‌రావు, కుర్మయ్య తదితరులు హాజరయ్యారు.

## రాష్ట్రస్థాయివా లీబాల్‌కువిద్యా ర్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 12 : 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి నిర్వహించిన వాలీబాల్ అండర్-14 స్కూల్ గేమ్స్‌లో అచ్చంపేట పాఠశాలకు చెందిన కనిమొల్లి, శ్రీవల్లి, నవీన్ ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పాండు తెలిపారు. వాలీబాల్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాకు పేరు తీసుకొచ్చారన్నారు. ఈ సందర్భంగా మంగళవారం డీఈవో గోవిందరాజులు విద్యార్థులను అభినందించారు. ఈ నెల 13వ తేదీలో నారాయణపేట జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పాండును డీఈవో అభినందించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి పాండు, ఎస్‌పీసీ కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, వెంకటేశ్వర్లశెట్టి, హెచ్‌ఎం శేఖర్, చక్రపాణి పాల్గొన్నారు.

## ప్రయోగాల ద్వారా సైన్స్ బోధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న షర్ఫొద్దీన్

లింగాల, డిసెంబర్ 12 : జీవ, రసాయన శాస్త్రాలను ప్రయోగాల ద్వారా విద్యార్థులకు పాఠాలు బోధించాలని కాంప్లెక్స్ హెచ్‌ఎం తాహేర్‌పాషా అన్నారు. మంగళవారం మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవ, రసాయనిక శాస్త్రాలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి మురళీధర్‌రెడ్డి,జిల్లా అకాడమిక్ మానిటరింగ్ షర్ఫొద్దీన్ మాట్లాడారు. తెలంగాణ పాఠశాల ఎడ్యూకేషన్ యాప్‌లో సెల్ఫ్ అసెస్మెంట్, విద్యార్థుల మార్కులను పొందుపర్చాలన్నారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు, పాఠ్య ప్రణాళికలు, ప్రశ్నాపత్రాల తయారీ, బోధన అభ్యసన కృత్యాలు, కఠిన అంశాలను ప్రయోగాల విద్యార్థులకు బోధించాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎం తాహేర్‌పాషా, ఉపాధ్యాయులు శ్రీనివాసులు,సుబ్బయ్య, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

## తపాలా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

వంగూరు, డిసెంబర్ 12 : తపాలా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంగళవారం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పోస్టల్‌శాఖలో పని చేస్తున్న తపాల కార్మికులు( జీడీఎస్) మండల కేంద్రంలోని పోస్టల్ కార్యాలయం ఎదుట తమ సమస్యల సాధన కోసం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8 గంటల పని, పింఛన్‌తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని కోరారు. బిజినెస్ టార్గెట్‌ల పేరు తో వేధించే అన్ని పద్ధతులను ఆపివేయడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జీడీఎస్‌లు రాజు, క్రిష్ణ, వెంకటేశ్వర్‌రావు, నారాయణ, హరినాథరావు పాల్గొన్నారు.

## ఉపాధి పనులన్నీ సక్రమమే

- సామాజిక తనిఖీలో డీఆర్‌డీవో రాజేశ్వరి

తిమ్మాజిపేట, డిసెంబర్ 12 : మండలంలో గత సంవత్సరం ఉపాధి పనులకు సంబంధించిన సామాజిక తనిఖీలో అన్ని సక్రమంగా ఉన్నాయని అదనపు డీఆర్‌డీవో రాజేశ్వరి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రజావేదికను నిర్వహించి ఆమె మాట్లాడారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన రూ.3.70 కోట్ల పనుల వివరాలను సీఆర్‌పీలు వెల్లడించారు. పనుల్లో భాగంగా నాటిన మొక్కలు పూర్తిస్తాయిలో లేవని, తిరిగి నాటాలన్నారు. జాబ్‌కార్డులు అప్‌డేట్ లేకపోవడం మినహా అంతా సక్రమంగా ఉందని తేల్చారు. కొన్నిచోట్ల ఫొటోలు లేవని, బోర్డులు ఏర్పాటు చేయలేదన్నారు. పలు జీపీలలో ప్లాంటేషన్లు నిర్వహణ బాగుందని ఆమె కితాబిచ్చారు. సమావేశంలో ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీడీ చంద్రశేఖర్, తనిఖీ అధికారి నజీర్, ఎస్పీఎం జ్ఞాననంద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట, డిసెంబర్ 12 : ప్రభుత్వ దవాఖానలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం సాయంత్రం అచ్చంపేట ప్రభుత్వ దవాఖానలో డాక్టర్లు, సిబ్బందిచే సమీక్ష సమావేశం నిర్వహించారు. దవాఖానలో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బంది సంఖ్య, పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. అందరు సమయపాలన పాటించి, అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారి డాక్టర్ రమేశ్‌చంద్ర, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభు, ఇతర డాక్టర్లు, సిబ్బంది, కౌన్సిలర్ శ్రీనివాసులు, గంగాపురం రాజేందర్, నాగ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన బల్మూర్ మండలం మైలారం గ్రామానికి చెందిన వెంకటేశర్లు కుటుంబాన్ని పరామర్శించారు.

## 15న ఉచిత కంటి వైద్యశిబిరం

పాన్‌గల్, డిసెంబర్ 12 : మండలంలోని రేమద్దులలో కేమ్మార్ వాలంటరీ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 15న ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అబ్దుల్‌ఖాదర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. శిబిరంలో అవసరమున్న వారికి కంటి ఆపరేషన్లు, అద్దాలు పంపిణీ చేస్తామన్నారు. కంటివైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన వెంకటేశ్వర్లు

బల్మూరు, డిసెంబర్ 12 : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన మండలంలోని మైలారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కానమోని వెంకటేశ్వర్లు(53) రైతు పొలంలో వేరుశనగ పంటకు నీళ్లు వదలడానికి వెళ్లి విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల రైతులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం తెలిపారు. మృతుడి భార్య సుల్తానమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై శేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని అచ్చంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని సర్పంచ్ శ్రీనివాసులు తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కల్వకుర్తి రూరల్, డిసెంబర్ 12 : మండలంలోని మార్చాల గ్రామానికి చెందిన కిశోర్ (30) హైదరాబాద్ ఓ ప్రైవేట్ దవాఖానలో మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై రమేశ్ పేర్కొన్నారు. మార్చాల గ్రామానికి చెందిన కిశోర్ నల్గొండ జిల్లా డిండి ముత్తూట్ ఫైనాన్స్‌లో విధులు నిర్వహించేవాడని సోమవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళ్తుండగా తాండ్ర సమీపంలో ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో కిశోర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కల్వకుర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించి వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌కు తరలించారు. మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి ఇటీవలే వివాహమైనట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత.. కేసు నమోదు

వంగూరు, డిసెంబర్ 12 : మండలంలోని డిండిచింతపల్లి పరిధిలోని దుందుభీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం రాత్రి పట్టుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## నూతన ఆలయాలకు విరాళాలు అందజేత

బల్మూరు, డిసెంబర్ 12 : మండలంలోని బాణాల గ్రామంలో చెన్నకేశవ నూతన ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన రాత్లావత్ రమేశ్ నాయక్ మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.50వేల నగదును అందజేశారు.

**ఊర్కొండలో..**

ఊర్కొండ, డిసెంబర్ 12 : నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన ఆడపడచులు భారీగా విరాళం అందజేశారు. మండలంలోని రాచాలపల్లి గ్రామానికి చెందిన నర్సిరెడ్డి కూతుర్లు తమవంతూ సాయంగా గీతామణినాల్‌రెడ్డి రూ.1,01,116, పారిజాత ప్రకాశ్‌రెడ్డి రూ. 51,000, ఊమా చంద్రారెడ్డి,75,000 వేలను మాజీ ఎంపీపీ దీపగోపాల్‌రెడ్డికి అందజేశారు.